# పంపకం

## లలిత

ఆయన చంద్రపురి వెళ్లారు. పదిరాత్రులు గడచిపోయినై. ఇంతవరకు యింటిమొహం పట్టాలని ఆయనకి తలంపే కల్గలేదేమో !

అవును.... ఎందుకు కలుగుతుంది? ఉషారాణి లేదూ అక్కడ :

వెనక్కి తిరిగి నా ఛాయని ఒక్కసారి చూచుకున్నాను, ఉషారాణికంటె నేను అందంగా వున్నానా, లేనా అని. ఉషని యీమధ్య నేను చూడలేదే ! ఆ అమ్మాయిని చూసి నాలుగైదేళ్ళవుతుంది. నాకంటె ఏమంత అందంగా వుంటుందేమిటి ! ఉండదని ఆయనకూడా ఒకప్పుడన్నట్టే నాకు జ్ఞాపకం.

ఆయన శీలాన్నిగురించి వృథాగా అనుమాన పడుతున్నానా ! అనుమానపీడితమైన నామనస్సేయిదంతా కల్పిస్తోందా ! ఇవన్నీనావూహలె !

అనంతమైన ఆకాశంలో నిరంతరమూ ప్రయాణంచేసే శశాంకునివంక నిస్సహాయంగాచూస్తూ ఊహలు రేకెత్తించే వెన్నెలలో కూచున్నాను. నిశ్శబ్దానికీ, ఆలోచనకీ భంగపాటు కలిగింది.

"అమ్మగారూ, కొబ్బరికాయ పచ్చడికూడా చెయ్య మన్నారా ? వంకాయ పచ్చడితో వూరుకో మన్నారా ?" సుబ్బమ్మ - వంటమనిషి అడిగింది.

"ఊం - వద్దులే." అన్నాను.

"వేపుడుముక్కలు చల్లారిపోతే మట్టిబెడ్డల్లావుంటాయి- మీకు వడ్డించమన్నారా ?"

"ఊం!"

అరుగుమీదనుంచి లేవబోతూవుండగా, మూడు నెలల నుంచీ మంచంమీదవున్న మామగారు "అమ్మాయీ!" అని కేకేశారు.

"ఎందుకండీ ?" అంటూ ఆయన పక్కదగ్గరికి వెళ్లాను. "అమ్మాయీ, ఆ నరసింహం పదివేలూ అసలీ ఫాయిదాలతో యిచ్చేశాడా, లేక పేచీ పెడుతున్నాడా ?"

"ఇచ్చేసినట్టున్నాడండీ. ఆ రోజునే సొమ్ము అంతా బ్యాంకిలో కట్టేశాడనుకుంటాను."

"మరి—వాడో?"

"ఎవరు ?"

"వాడే !"

"ఎవడండీ వాడు ?"

నాచేతిలో తాళంచెవులు "గల్ గల్" అన్నాయి. ఆయన ధనాపేక్షచూసి యికిలిస్తున్నాయా ?

"వాడమ్మా !—ఆ చంద్రపురిలోవాడు"

"రామయ్యా?"

"ఊఁ"

"అతను కొద్దిగా పేచీ పెడుతున్నాడు."

అంత అస్వస్థతగా వున్నా, ధనకాంక్షమాత్రం ఆయన్ని పేల్చుకుతింటూనే వుంది. దేహంలోని పీడకి జంటగా, యీమానసిక పీడ—

"అబ్బాయి చంద్రపురినుంచి రాలేదేం?"

నాకుమాత్రం ఏం తెలుసు? ఆయన కెంత తెలుసో నాకూ అంతే తెలుసు.

"వస్తారు—యివాళో, రేపో"

"ఏదో వ్యవహారాలవల్ల యిన్నాళ్లు వుండివుంటాడు."

"అవును—వ్యవహారాలే!"

ఉషారాణి వ్యవహారాలు.

సుబ్బమ్మ అరిచింది. "అమ్మగారూ, అన్నం చల్లారి పోతోంది."

"మరి చెప్పవేం! అన్నం చల్లారిపోతూవుంటే!" అన్నాడు మామగారు.

చిత్రం— మామగారికి వయసు మళ్ళినా, అన్నిటిమీదా భ్రాంతి సన్నగిలినా, ఆముష్మికచింత ఎంతవున్నా, ధనం అంటే మమకారం మాత్రం క్షీణించలేదు. ధనంతో కొన లేనిదీ, ధనానికికూడా అందుబాటు కానివీ కొన్ని యీ ప్రపంచంలో వుంటాయని గ్గానీ వుండవచ్చుననిగానీ ఆయన కెప్పుడూ స్ఫురించనేలేదు కాబోలు!

భోజనంచేసి మేడమీదికి వెళ్ళాను. నా మానసికవేదనకి ఆద్యంతాలు తెలీక బాధపడుతూ పక్కమీద వొరిగాను. "ఆయనరానీ—చెప్తాను" అనుకున్నాను. నిద్రాదేవత నా కళ్లు మూసింది.

*  *  *

మర్నాడు మధ్యాహ్నం భోజనం అయినతర్వాత, సావిట్లో తివాసీమీద కూచుని, కాలం వెళ్ళబుచ్చేందుకు వొక పనికిమాలిన నవల చదువుతున్నాను. పేజీలు తిరగే స్తున్నానన్నమాటేగాని ధ్యాస యింకొకచోట వుంది. రాత్రి జరిగిన ఘటనలు ఒక్కొక్కటే జ్ఞాపకం వొస్తున్నాయి. కథలోని విషయంకంటె ఉషారాణిని గురించిన ఆలోచనలే నాబుర్రలో తీవ్రంగా పనిచేస్తున్నాయి.

ఆయనహృదయంలో నాకు తప్ప అన్యులెవరికీ స్థానం లేదని నమ్మానే. యింతకిపూర్వం అంత నమ్మింపజేసి, మనసిచ్చి, మనస్సు పుచ్చుకోగలిగిన భర్త ఈనాటికి ఆవుషా రాణికి వశ్యులై పోయారా? ఉ-షా-రా-ణి- ఆ పేరే నాకు వెయ్యితేళ్లు కుట్టినబాధ కలిగిస్తోంది.

ఇంతదాకా సాంసారికజీవనం హాయిగా, ఒక నిర్భయా నందస్వప్నంవలె గడిచిపోయింది. ఇకమీద, అది ఒక పీడ కలవలె పరిణమిస్తుందేమో!

ఉషా! నువ్వు మానవస్వరూపంలోవున్న పిశాచానివి.

పొరబాటు. ఆ అమ్మాయిని నిందించడం ఎందుకు? మనబంగారం మంచిదికాదు. నా భర్తకే నామీద సంపూర్ణానురాగం వుంటే ఉష యేంచెయ్యగలదు?

లోపం ఆయనది.

ఆయనొక్కరిదేనా! కాదు. కానేరదు. ఇద్దరూదోషులే! ఆదోషంలో ఎవరిది ఎంత భాగమో వారి హృదయాలకే తెలియాలి.

"అమ్మాయీ!" అని మామగారు కేకేసే వరకూ ఆదీ అంతూలేని ఆలోచనలు నా మెదడుని కలవర పెడుతూనే వున్నాయి.

"ఈరాత్రి అబ్బాయిరావడం నాకు తెలుసునుగాని వెళ్ళడం మాత్రం నాకు తెలియదమ్మా. వెళ్ళేటప్పుడు నాకు చెప్పనన్నా లేదే. నన్నెందుకు లేపలేదూ?"

"నిద్రపోతున్నారని లేపలేదు—నాన్నగారిని లేపకు, నేను వెళ్ళానని తెల్లవారినతరువాత చెప్పు" అని ఆయనఅన్నారు.

"ఏం అంత అర్ధరాత్రి వెళ్లాడేం, ఉదయం వెళ్ళకూడదూ? రాత్రి అంతా నిద్రలేకపోతే ఆరోగ్యం చెడిపోదూ?"

"కోర్టులో ఏదో వాయిదా వుందట."

వాయిదా వున్నమాట వాస్తవమే. అది కోర్టులోనో, ఉషారాణి దగ్గరో నాకుమాత్రం ఏం తెలుసు?

"ఆ రామయ్య కొంత లెక్క యిచ్చాడా,— నిన్నరాత్రి యినప్పెట్టి చప్పుడైనట్లుంది!"

కొద్దిగా ఖంగారుపడ్డాను. అప్రయత్నంగా "నాకు తెలి దండీ" అన్నాను.

"పెట్టెతాళాలు నీ దగ్గర లేవూ?"

"నాదగ్గిరే వున్నాయి. అవసరం వుందని అడిగి పుచ్చు కున్నారు. వెళ్లేటప్పుడు యిచ్చేశారు."

"ఎందుకో అడగలేదూ?"

"అడగలేదండీ" అన్నాను చటుక్కున. అబద్ధమే ఆడాను.

చెప్తే ఒకచిక్కు, చెప్పకపోతే మరోచిక్కు. కొడుకు ఎలాంటివాడయినా, అతనిబుద్ధి ఎంత వక్రించినా, తండ్రి—ముసలితండ్రి—కొడుకుపక్షం చెప్పక మానతాడా? నోరు జారితే నా మాట అలుసయిపోతుంది గాని ప్రయోజనం సున్నా.

"నువ్వుకూడా కనుక్కుంటూ వుండాలమ్మా లేకపోతే వాడు వట్టిదూబరా ఖర్చులు చేస్తాడు. సొమ్ము తీసుకువెళ్లేదో తీసుకువచ్చేదో తెలీదన్నమాట."

"ఊహుం"

"అయినా పెట్టితెరచిచూడు."

"చూస్తానులెండి," అన్నాను. యింతలోఅదృష్టవ శాత్తూ 'లలితా' అనిపిలుస్తూ నరసమ్మవచ్చింది. ఆమెను చూసీచూడ్డంతోనే నాగుండె బరువుగాతోచింది. ఆమె ఉష తల్లి అన్నవిషయమే ఆమెనిచూస్తే నాకుబాధకలిగింప చేసింది. మనస్సులోలేని ఆదరణ మొహంలో కనబరుస్తూ, "నరసుపిన్నీ, కూచో." అన్నాను తివాసీచూపిస్తో.

"మీ ఆయన ఏడీ ?"

ఎందుకో, ఆవిడ కెందుకో నా భర్తవిషయం !

"రాత్రివచ్చి వెళ్లిపోయారు."

"ఏమమ్మా: అంతఅర్జంటేమిటి ?"

"నాకుచెప్పుతారా, పిన్నీ ?"

"చంద్రపురినించి వచ్చాదుకదా, ఉష సమాచారంఏమ యినా చెప్తాదేమోఅని వచ్చాను."

"మళ్లా చంద్రపురేవెళ్లారు, పిన్నీ."

రెండునిమషాలు ఏంమాట్లాడుకోవాలో తెలీక నిశ్శబ్దంగా కూచున్నాం. ఎక్కడోహరికథఅంటూ ఆమె వెళ్లిపో యింది.

నా దేహాన్ని వెయ్యి సూదుల్తో గుచ్చినట్లు ఫీలయ్యాను. తన ముద్దులకూతురు ఉష విషయం ఆయనద్వారా తెలుసు కోవాలట....అపును....ప్రస్తుతం మంచిచెడ్డలు ఆయనకేగా బాగా తెలుసు.

* * *

## వెంకట్రావు

పదిరోజుల తరువాత ఆరాత్రి యింటికివచ్చాను. అరవై మైళ్లు కారులో అలసివచ్చిన నాకు పీధిగుమ్మంలోని మల్లెపూవులు స్వాగతమిచ్చాయి.

గదిలో ప్రవేశించాను—వివిధాలోచనలతో. నారింజపండు రంగుదీపం సన్నగా వెలుగుతోంది. ప్రశాంతంగా నిద్రపోతోంది లలిత.

వొంటిమీద తట్టాను. ఉలిక్కిపడి లేచింది. నుంచుని కొనగోళ్ళతో శిరోజాలు సర్దుకుంటోంది.

"ఇప్పు డెలావచ్చారు ?"

"అంటే ?" అన్నాను.

"రైలుమీద వచ్చారా ?"

"కారు అక్కడే వుందికదూ ?—కారుమీద వచ్చాను."

ఆవులించింది. నిద్ర కళ్ళమీదకి వస్తోంది కాబోలు.

"నిన్ను నిష్కారణంగా లేపాను. నిష్కారణ మేమిటిలే ! లేపక తప్పిందికాదు."

ప్రశ్నార్థకంగా నాకేసి చూసింది.

"ఇప్పుడు ఎన్నిగంటలైంది ?" అంది—ఆవులిస్తూ,

వాచీ చూసి చెప్పాను, "పదకొండున్నర"

"ఇంతే !"

"ఊఁ !"

"భోంచేసే బయలుదేరేరా ?"

"ఊఁ!"

"మంచినీళ్లు పుచ్చుకోరూ?" అంటూ వెండిమరచెంబులో నీళ్లు గ్లాసులో పోసింది.

వద్దన్నాను— ప్రయాణబడలికవల్ల కలిగిన చిరాకుతో.

"కారుప్రయాణంతో అలసట చెందినట్టు కనిపిస్తున్నారు. మీరు ఒక్కరే వచ్చారా, డ్రయివర్ని కూడా తీసుకు వచ్చారా?"

నేను యితర ధ్యాసలోవుండి జవాబుచెప్పలేదు. యిద్దరమూ రెండునిమిషాలకాలం అలాగే నిశ్శబ్దంగా కూచుండిపోయాం.

"లలితా" అన్నాను.

"ఏం?"

"ఇనప్పెట్టితాళాలు ఎక్కడ వున్నాయి?"

"సాంఘికచిత్రాల్లో నాయకుడు పతితుడై పోయేముందు ప్రవర్తించేవిధంగా ప్రవర్తించానని" లలిత ఊహిస్తోందనుకుంటాను.

"ఎందుకు?" అని తక్షణం ప్రశ్నించింది.

"కావాలి"

ఎందుకు?"

"ప్లీడరుకి కొంతసొమ్ము యివ్వాలి. ఇంకా కొన్ని అవసరమైన ఖర్చులున్నాయి."

ఉషకోసం అబద్ధాలాడుతున్నా నని అనుకుంటోందా లలిత ?—"ఛీ.... అంత అనుమానమా ?" అని మనస్సులో విసుక్కున్నాను. ఈసొమ్మంతా ఉషకి యిస్తాననా ? ఉషకి కావాలా యిలాటివి ? కొరివిదయ్యాలు ఆమెబుర్రలో కొర కంచులతో ఆడుకుంటున్నాయి.

తలగడకిందవున్న తాళాలతో బీరువా తెరచి, మామ గారు దాచిన ప్రకారం భద్రంగా, దాచిన యినప్పెట్టితాళాలు తీసి, తనమనస్సులోవున్న కోపాగ్నినంతా వాటిమీదకి చూపుతూ నేలమీదకి గిరవాటు పెట్టింది.

వంగి తాళంచెవులు తీసుకున్నాను. ఆమె అనుమానంతో కుంగిపోతోంది. నుంచోలేక పక్కమీదికి ఒరిగింది.

ఒంటిగంట దాటుతుంది. ఖజానాపెట్టి తెరచి నాకు కావలసిన లెఖ్క తీసుకున్నాను. నాన్నగారు గాఢనిద్రలో వున్నారు.

తెల్లవారేసరికి చంద్రగిరిలో వుండాలి. తప్పకూడదు.

సావిట్లో వాలుకుర్చీలో పడుకుని, లలితని ఆందోళన పరుస్తున్న అనుమానబీజాలు పోగొట్టడం ఎలాగా అని తీక్షణంగా యోచిస్తున్నాను. లలిత మేడదిగింది.

ఎలా కనిపెట్టిందో, "ఏమండీ, రెండు ఉంగరాలకీ వొక్కఉంగరమే ఉందేం చేతివి? రెండోదేదీ ?" అంది లలిత.

చిరునవ్వు నవ్వుతూ— తెగించి అన్నాను "ఉషదగ్గిర"

"............"

"రైలుకి వెళ్తున్నాను."

"ఇప్పుడే"

"ఊఁ"

"మళ్ళీ ఎప్పుడొస్తారు ?"

"ఎల్లుండి సాయంత్రం"

"నిజంగా" అంటూ అమాయకంగా చూసింది. ఆమె పడుతున్న బాధనంతా వ్యక్తపరిచే ఆచూపు ఎన్నటికీమరచి పోలేను.

"నమ్మ—నమ్మకపో," అన్నాను, చెక్కిళ్లు స్పృశిస్తూ.

మూడోనాటి సాయంత్రానికి వస్తానని చెప్పి, మధ్యాహ్నానికే వచ్చాను. మూడుగంటలవుతుంది. లలిత సావిట్లో కూచుని ఏదోవార్తాపత్రిక చదువుకుంటోంది.

నన్ను చూడగానే, "వచ్చారూ?" అంటూ వుత్సాహంతో పలకరించింది. వస్తానని అనుకోలేదు కాబోలు.

"టీ తయారైందా సుబ్బమ్మా" లలిత అధికారంతో అరచింది.

అయిందని సుబ్బమ్మ జవాబు

ఇద్దరికీ తీసుకుని రమ్మని దేవిగారి ఆజ్ఞ.

అప్పుడే టీ పుచ్చుకువచ్చానని నా......

"ఎక్కడ?" లలిత అడిగింది.

ఆవేదన ఆమె కనుకొలకుల్లోంచి తొంగిచూస్తోంది.

"లలితా!" అన్నాను, ఎంతో ముద్దుగా.

మళ్ళీ అన్నాను సున్నితంగా. జాలితో కూడిన ఆమార్దవమైన పిలుపుకి ఒక చిన్ననవ్వు బహుమానంగా యిచ్చింది. ఈర్ష్యా, క్రోధమూ ఎరుగని నిర్మలమైన నవ్వు. బహుశా లలిత ఉషని పూర్తిగా మరచిపోయిన క్షణాలలో అది ఒకటై వుండవచ్చును.

"టీ ఎక్కడ పుచ్చుకున్నారు?"

"నరసమ్మ యింట్లో."

"ఉషకూడా వచ్చిందా?"

"ఊఁ, ఇద్దరమూ కలిసేవచ్చాం."

"ఇక్కడికి తీసుకురాలేదేం ఉషని?"

ఆమె మొహంలోకిచూస్తూ, "సాయంత్రం వస్తుంది," అన్నాను. లలిత వొక్కర్తే టీ తాగింది. "నువ్వు యివాళ వర్ణించలేనంత అందంగావున్నావు లలితా!"

"లేని కొత్తఅందం ఇవాళ ఎక్కణ్ణుంచి వచ్చింది?— అయినా...." దెప్పుతోంది.

"అదిగో, అదిగో! ఈర్ష్య—అసూయ—జెలసీ—"

"ఎందుకండీ?"

"నేను ఉషారాణిని ప్రేమిస్తున్నానని నీభయం"

"ప్రేమిస్తున్నారా." అంది, దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ.

"నీ భయం," అన్నాను.

"నేను యీ భయాలకీ అనుమానాలకీ అతీతురాలనని మీకు తెలీదూ?" అని గంభీరంగా మాట్లాడింది.

అతీతురాలు కాదని నాకు స్పష్టంగా తెలుసు. ఆమె పలుకులలో దాంబికంమాత్రం వుట్టిపడుతోంది. అతీతురాలవుదామనే ప్రయత్నం ఆమెలో వుందేమోచెప్పలేను.

కొంటెతనంగా నవ్వింది; ఆ నవ్వులోని అంతరార్థం నాకు తెలీదు.

"అమ్మాయీ!" అని వుత్తరవైపునుంచి పిలుపు వినిపించింది.

తను వస్తున్నానని ఆ పిలుపుకి జవాబుయిస్తూ, "మీ నాన్నగారిదగ్గరకి రండి." అంటూ నాచెయ్యి పుచ్చుకు తీసుకువెళ్ళింది.

*　　*　　*

"మంచీచెడ్డా నాచెవినికాస్తవేస్తూవుండరా అబ్బాయ్!— ఆ రామయ్య లెక్కంతాయిచ్చేశాడా?" అన్నారు నాన్నగారు.

"లేదండీ—పేచీలు పెడుతున్నాడు."

"నాకు తెలుసు. వాడు వట్టి దగాకోరు." నాన్నగారు ఒక పావుగంటసేపు రూపాయిలగురించిన వ్యవహారాలు

మాట్లాడి, తత్సంబంధమైన కొన్నిసలహాలిచ్చారు. "చంద్ర పురిలో అన్నిరోజులు వుండిపోయావేం!"

"ఊరికేనండీ"

"పచ్చగా వున్నవాణ్ణిచూస్తే లోకులకి గిట్టదు, ఎవరినీ నమ్మకు నాయనా"

"మీరేం బెంగపెట్టుకోనక్కర్లేదు, ఎవర్నీనమ్మరులెండి, ఉషనితప్ప" అని మనస్సులో అనుకుంటోంది కాబోలు లలిత.

జడఅల్లుకు వస్తానంటూ గబగబా మేడమెట్లుఎక్కింది లలిత.

సాయంత్రం అయిదున్నరకి ఉషవచ్చింది. తెల్లటి గ్లాస్కోచీర, సిల్కు జంపరూ ధరించింది. వికృతమైన అలంకారాలూ, ఆభరణాలూ ఆమెకి నచ్చవు. ఎప్పుడూ నిరాడంబరంగానే వుంటుంది.

ఉష వచ్చేటప్పటికి నేను మేడమీద వున్నాను. లలిత ఒక్కర్తే సావిట్లోవుంది. ఉషవచ్చిన అలికిడై నేను మేడ దిగి కిందికి వచ్చేటప్పటికి ఉషా, లలితా నాన్నగారి గదిలో వున్నారు.

"నాతో చెప్పలేదేమిరా అబ్బాయ్, ఉష వచ్చిందని!" అన్నారు నాన్నగారు. పరధ్యాన్నంగా వుండడంవల్ల ఆయన ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. ఉషమొహంలోకి చూస్తూ ప్రశ్నించాను.

"ఎంతసేపైంది ఉషా, వచ్చి?"

"ఇప్పుడిప్పుడే!" ఉష ప్రశాంతంగా నావంక చూసింది. ఎంత ధయిర్యమో! ఆపైనచూపులు లలితవైపుకి మళ్ళించి మెల్లిగానవ్వింది. లలితకి కోపంరాదుగదా!

ఇంతలో సుబ్బమ్మ లలితని పిలిచింది. "ఏం?" అంటూ వంటగదివైపుకి వెళ్ళింది.

లలితవెనకాలే నడిచింది ఉష. నేను సావిట్లోకి వచ్చి కూచున్నాను.

ఉష సుబ్బమ్మని పలకరించడం — ఆమె క్షేమసమాచారాలు వాకబుచెయ్యడం — ఆమె అల్లుడూ, కూతురూ పేచీలు లేకుండా కాపరం చేస్తున్నారా అన్నవిషయం కనుక్కోవడం — వాటికి సావధానంగా సుబ్బమ్మయిస్తున్న సమాధానాలూ — యివన్నీనాకు సావిట్లోకి వినిపిస్తూనే వున్నాయి.

వంట పురమాయింపు అయిపోయినతర్వాత ఉషా, లలితా సావిట్లోకి వచ్చారు. నేను ఏదో పత్రికలోని పేజీలు తిరగవేస్తున్నాను. డ్రయివరు వెంకన్న వీధిగుమ్మంలో నుంచున్నాడు.

"ఏమండోయ్ అమ్మగారూ ఎప్పుడు వచ్చారూ?" అన్నాడు వెంకన్న, ఉషారాణిని ఉద్దేశించి.

"మధ్యాహ్నం."

అయిదేళ్ళకిపూర్వం ఆయింట్లో కుడిపాదంపెట్టిన తన కంటె అయిదునిమిషాలకిపూర్వం వచ్చిన ఉషారాణియింట్లో వున్నవారందరి గౌరవానికి పాత్రురాలైనట్టు లలిత అనుమానపడుతోందా అనిపించింది.

ముగ్గురం సుమారు రెండుగంటలసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం. మర్నాడు మధ్యాహ్నం వస్తానని మా అందరి దగ్గరా సెలవుపుచ్చుకువెళ్ళింది ఉష.

"ఏమండీ, నేను ఒక్క విషయం అడుగుతాను—నిజం చెప్తారా ?"

"ఏమిటి ?" అన్నాను, నవ్వుతూ.

ఎంచేతనో యిద్దరం చాలా సరదాగావున్నాం ఆరాత్రి.

"ఉషని మీరు ప్రేమించటంలేదూ ?— నిజంచెప్పండి.... ప్రేమిస్తున్నారు, నాకుతెలుసు."

చిరునవ్వు నవ్వాను.

"ప్రేమించకేం—ఉషని ఎంతోకాలంనుంచి ప్రేమిస్తున్నాను. ఆమె నన్నూ ప్రేమిస్తోంది. ఆమె నాకోసం ఎంతకైనా త్యాగంచెయ్యగల సమర్థురాలు. కాని, లలితా ! మా యిద్దరివీ తీరనికోరికలు. ఉష నువ్వనుకున్నంత, అనుకుంటున్నంత నీచస్వభావురాలు కాదు. నువ్వు మాయిద్దరినీ, మా అనురాగాన్నీ పూర్తిగా అర్థంచేసుకోగలిగితే జాలి పడతావు."

"అది సాధ్యమా, అదే సాధ్యమైతే యీ మానసిక క్షోభఅంతా దేనికి?" అన్నట్లుగా నాకళ్లల్లోకి చూసింది లలిత.

పాపిటమీద చెయ్యివుంచి, శిరోజాలు నిమురుతూ "లలితా, ద్వేషించడం సులభం; ప్రేమించడంకష్టం.... చాలా కష్టం" అన్నాను.

నిజంకాదూ!!

* * *

## ఉషారాణి.

బాల్యంనుంచీ నాజీవితం తీరనికోరికా, ఆరనిమంటా. చిన్నతనంలో చందమామని చూస్తేనేకాని బువ్వతిననని మారాముపెట్టేదాన్నిట. ఇప్పుడు ఆచందమామనే చూస్తూ వుంటే, ఆకాశమబ్బుల్లో విశ్వవిహారం చెయ్యాలనిపిస్తుంది.

నేను జీవితంలోని ఏ కోర్కెనీ, ఏ ఆనందస్వప్నాన్నీ తృణీకరించలేను. అలసటతోనూ, నిరుత్సాహంతోనూ యీ జీవితశకటాన్ని నిర్జీవంగా తోలలేను. చైతన్యంలేని జీవితమంటే నాకు పరమఅసహ్యం. ఆసక్తిలేనిపనులు చెయ్యడానికి నిర్మొహమాటంగా నేను నిరాకరిస్తాను.

వెంకట్రావుని ప్రేమించడం లలితకి అపచారంగా నేను ఎన్నటికీ భావించలేను. మా ప్రణయం ప్రొఫెసరుగారికి పూర్తిగా తెలిసినా ఆయన బాధపడతారని నేను అనుకోను.

సుఖదుఃఖానుభవాలు యిచ్చే నా భౌతిక, ఆధ్యాత్మిక దేహాల మీద నాకు సంపూర్ణ హక్కులున్నాయి. వివాహంనాడు భర్తకి సహధర్మచారిణిగా ఉంటానని వాగ్దత్తం చేశానే కాని నా ఆత్మని విక్రయించి యావజ్జీవం ఆయనకి బానిసగా వుండగలందులకు అంగీకరించలేదు. నాకు తెలీని సంస్కృతంలో నాచే ఏ ప్రమాణాలు చేయించారో వాటికి నేను జవాబుదారీ కాదు. ఆనాడూ, యీనాడూ నా ఉద్దేశ్యం మాత్రం అంతే!

Compensationate marriage లో నాకు విశ్వాసం వుంది. పెద్దలు నిశ్చయించే పెళ్ళిళ్ళలోగాని, వధూవరులు వరించి చేసుకున్న వివాహాలలోగాని నాకు అణుమాత్రమైనా నమ్మకంలేదు. పిచ్చి రిఫారమ్స్, వేషభాషలుమాత్రమే ప్రధానమైన నాగరికతనీ నేను ఏవగింపుతో చూస్తాను. సంఘసంస్కరణ అంటే నాకు తలనొప్పి.

ప్రొఫెసరుగారింట్లో కాలుపెట్టి యిప్పటికి అయిదేళ్ళు యింది. ఆయన అవసరాలు నాకూ, నా అవసరాలు ఆయనకూ స్పష్టంగా తెలుసు. పోరూ పొక్కూ లేకుండా దివ్యంగా గడచిపోతోంది సంసారయాత్ర.

వెంకట్రావు నా జీవితంలో ఎప్పుడో ప్రవేశించాడు. మా యిద్దరికీ చిన్నప్పట్నుంచీ పరిచయం. ఇద్దరం ప్రేమించుకొంటూన్న మాటవాస్తవమే! అనేక అవాంతరాల వల్ల మా యిద్దరికీ వివాహం కాలేదు. కాని అది మా నేరం కాదు. యీనాడు ఏలలితో యేప్రొఫెసరుగారో వచ్చి వెంకట్రావునిగురించిన తలంపే తప్పనీ, నింద్యమనీ, దోషమనీ నా మీద దండెత్తితే, ఒక్క వెకిలినవ్వు నవ్వి, వారి సంకుచిత హృదయాలగురించి జాలిపడతాను.

రయిల్లో ప్రయాణం చేస్తూన్నంతసేపూ, వెంకట్రావు తనగొడవ సోదిగా చెప్పాడు. అతని ఆశాసౌధాలను గురించి ఆలకించడం అదే మొదటిసారి కాకపోయినా. ఆతని అనస్థలు వినేసరికి నామనస్సు నీరైంది. యిద్దరికీ వివాహాలు అయిపోయిన తర్వాత యీఅయిదు సంవత్సరాలలోనూ యిద్దరమూ మొదటిదఫా తీరికగా, శ్రద్ధగా, జాగ్రత్తగా మా జీవితాల్ని సింహావలోకనం చేసుకున్నాం.

ప్రొఫెసరుగారు "స్కాండల్సు" అంటే నవ్వుతారు. అంచేత, ఆయన బాధపడరు. నన్ను బాధపెట్టరు. లలిత స్త్రీ అవడంచేతనూ, సంస్కారం లేకపోవడం చేతనూ, యితరమయిన అవసరకార్యాలేమీ అగుపించక పోవడం చేతనూ ఈప్రసక్తే తప్ప అన్యచింతన లేనట్లు తోస్తుంది.

రయిల్లో జరిగినసంభాషణ.

"ఎందుకు వెంకట్రావ్, అలా విచారపడతావు ? మూడు దినాలలో లలితమనస్సు పూర్తిగా మార్చేస్తాను" అన్నాను.

"అసాధ్యం" అన్నాడు పెదవి విరుస్తూ.

"గత్యంతరం?"

"లేదు. నేను యీజన్మంతా యిలా బాధపడుతూవుండ వలసిందే!" మాటలు మింగాడు.

జాలేసింది. నేను జీవించి వుండగానే వెంకట్రావుని అలా కృశించిపోనిస్తానా ? లలితలో మూర్ఖత్వమూ, అజ్ఞానమూ అలా కరుడుకట్టేయా ? ఆమెహృదయంలో పశుత్వం వుంది; మార్దవం లేదు. అంచేతనే, అంతజెలసీ.

ఆ సాయంత్రం వెంకట్రావు యింటికి వెళ్ళాను. నన్ను యింటికి ఆహ్వానించింది లలిత. మానవప్రకృతి, ముఖ్యంగా సక్రమశిక్షణ పొందని స్త్రీ ప్రకృతి చాలవింతగా వుంటుంది. ఎందుకు వెళ్ళాను. లలిత సేమ్యాపాయసమూ, రవ్వలడ్లూ బజ్జీలూ చేయించింది. కమ్మటి కూరలు వండించింది. ఎలాగైనా, చక్కటి వంటచేస్తుంది.

భోజనాలైన తర్వాత తమలపాకులు నములుతూ అడిగాను, "వెంకట్రావు, చదరంగం వుంది కాదూ ?"

"లేదు."

"వెంకన్నని మా యింటికి పంపి, తెప్పించు" అన్నాను.

పావుగంటలో చదరంగం వచ్చింది.

"ఎక్కడ కూచుందాం ?"

"మేడమీద కూచుని ఆడుకోండి," అంది లలితఅప్పటి కప్పుడే మమ్మల్నిద్దరినీ వేరుచేస్తూ.

"పైనే కూచుందాం నిశ్శబ్దంగా వుంటుంది." అన్నాడు వెంకట్రావు. లలితబుర్రలో ఎలాటిబూచులు భయోత్పాతాన్ని కలిగిస్తున్నాయో !

నిన్నటిఆదరణ యీరోజున లేదు. నేను ఈ యింటికి అధికారిణి అయిపోయినట్టూ తను నామమాత్రావశిష్టురాలయి నట్టూ భావిస్తోందనుకుంటాను.

పిచ్చిలలిత ఎందుకలా బాధపడుతోందో ? సమస్యలూ బాధలూ వృద్ధిచేసుకోవాలని ఉషారాణి, ఎప్పుడూ కోరుకోదు.

పదిహేనురోజులు గడిచినై. ఆ పదిహేను రోజులూ. రాత్రింబవళ్ళు, నేను వెంకట్రావుయింట్లోనో, వెంకట్రావు మా యింట్లోనో.

అమ్మ ఒకరోజున ముక్కుమీద వేలు వేసుకుంటూ అంది, "లోకులకన్నా వెరవవద్దటే !"

"డామిట్ ! మీరంతా వెరుస్తూవుండండి. నేను కూడా ఎందుకు ?" అన్నాను.

ఈపదిహేనురోజుల్లోనూ, నాలో వోర్పూ, వెంకట్రావులో కలతా, లలితలో జెలసీ దినదినప్రవర్ధమాన మైనాయి. లలిత రెండుమూడుసార్లు నన్నుద్దేశించి వ్యంగ్యంగానూ,

హేళనగానూ, తేలికగానూ మాట్లాడింది.

ఒకరోజున వెంకట్రావు యింట్లో లేనప్పుడు లలితతో అన్నాను. "అన్యకాంత అయిన ఉష వెంకట్రావుదగ్గిర ఎక్కువ చనువుతీసుకుంటోందని నీకు కోపమా ?"

"కోపమైతే మాత్రం నే నేం చేయగలను ?"

"నీ కాపరాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాననే అపోహలో నువ్వువుంటే, నేను మర్యాదగా తప్పుకుంటాను. వెంకట్రావు వొక పూలతీగలాటివాడు— ఏదో ఒక వృక్షాన్ని ఆధారంగా చేసుకుంటేనేగాని అతను బతకలేడు."

"నువు ఆ వృక్షానివి కాబోలు ;"

"అవును. మనిద్దరి మధ్యా అతను నిష్కారణంగా నలిగిపోతున్నాడు. నువ్వు ఆజెలసీ చంపుకోవాలి. అతని జీవితంలో ఉత్సాహశక్తిని మనిద్దరమూ పిప్పిచేసేస్తున్నాం"

"ఇద్దరమూ అనకు. లలితే కారకురాలు— లలిత తప్పుకుంటుంది—మీరిద్దరూ హాయిగా వుందురుగాని," అంటూ తలబాదుకు కళ్ళనీళ్లు పెట్టుకుంది.

ఆమెరెండుచేతులూ పట్టుకుని అంత అవ్యక్తంగా ప్రవర్తించవద్దని వారించేటప్పటికి నా పెద్దలు దిగివచ్చారు.

"లలితా, నువ్వు మూఢురాలవై పోతున్నావు. క్షమించు, యింతస్పష్టంగా చెప్పినందుకు. ధర్మమూ, న్యాయమూ, సాంప్రదాయమూ, వెంకట్రావుని నీవాణ్ణిగా చేస్తున్నాయి.

వాటికి అతీతమైన ప్రేమసూత్రాలు మా యిద్దర్నీ బంధించాయి. నువ్వు అంగీకరించకపోవచ్చును గాని, ఆ తేడా మనిద్దరిమధ్యా స్పష్టంగా కనిపిస్తూనేవుంది. నువ్వు వెంకట్రావుని నీకోసమే కోరుతున్నావు—స్వార్థంతో. నేను అతని కోసమే, అతన్ని ప్రేమిస్తూ, నా సంతోషాన్నీ తృప్తినీ నిమిత్తం మాత్రంగా చూసుకుంటున్నాను. నువ్వు కూడా అలా చూసుకోగలిగితే వెంకట్రావు అమోఘమయిన ఆనందాన్ని పొందుతాడు.... వెంకట్రావుమనస్సు నీకంటె నాకు యెక్కువగా తెలుసు."

"తెలుసు—తెలుసునని తెలుసు, చిరకాలపరిచయం."

నాకు చిన్నతనం వేసింది.

"లేకిగా మాట్లాడకు. నావల్ల నీసౌఖ్యానికి అంతరాయం కలుగుతోందని నువ్వు మనస్ఫూర్తిగా నమ్మగలిగితే, ఈ క్షణంలో నేను తప్పుకుంటాను. కాని, బాగా ఆలోచించుకో. లలితా, ఈకాస్త సౌఖ్యాన్ని కూడా నువ్వే నీ చేతులారా బుగ్గిచేసుకుంటావ్!"

"ఇప్పుడు నాకో సౌఖ్యం వున్నట్టు!"

"ఉంది, లలితా. వుంది. ఈ అశాంతిఅంతా నీ మనస్సు కల్పిస్తోంది. జెలసీదానికి దోహదం యిస్తోంది. నీ మనస్సు అసూయలో మునిగిపోకుండానూ. ద్వేషంతో కుళ్ళిపోకుండానూ వుంటే, నీచక్షువులకి నేనూ వెంకట్రావూ పార

నేరని పసిపాపలలా కన్పించివుండేవాళ్ళం. ఆ ఔదార్యం నీలో లేదు. నీ హృదయంలో ఆందోళన లేవదీసిన రాక్షస శక్తులకే నీబుద్ధికూడా సహాయం చేస్తోంది."

"నాకు మానాన్న పెద్దపెద్దచదువులు చెప్పించలేదు. ఈ హేతువాదాలూ, ప్రేమసూత్రాలూ, టక్కరిమాటలూ, కాపరాలు కూల్చడాలూ——"

"లలితా, నువ్వు తొంభైయేళ్ళ ముసలమ్మలా మాట్లాడుతున్నావు కాని నవ్యప్రపంచాన్ని యుగదృష్టితో చూడడం లేదు."

"లేదేం—!"

"లేదు. ఆదృష్టి నీకు లేదు, సంపాయించాలి."

"ఎలా?"

"అనుభవాలతోటీ, సంస్కారంతోటీ, విజ్ఞానంతోటీ సంపాయించాలి."

"చేతకాదు."

"అవివేకానికి అనుభవించవలసివస్తుంది."

"కాపరాలు నేలమట్టంచేసే పయోముఖవిషకుంభాలో?"

"లలితా, నీ కాపరం నావల్ల శిథిలమై పోతోందని నీ భ్రమ. నీ భర్తమీద నీకున్న అధికారాలు నేనుఅపహరించి, దుర్వినియోగపరచుకుంటున్నాననికూడా పొరబడుతున్నావ్! సంఘం నీకీ అధికారాలు యిచ్చింది. కాని, ప్రకృతి మాకు

ప్రేమ పంచిపెట్టింది. ఈనాటినుంచీ, తిరిగి మీ అనుజ్ఞ యిచ్చేదాకా నీభర్తతో ఎట్టి సంబంధమూ పెట్టుకోననిమాట యిస్తున్నాను. ఉషారాణి అన్నమాట తప్పదు. నాప్రేమలో సత్యం వుంది. అంచేతనే యింతటి త్యాగానికికూడా నేను జంకడంలేదన్న విషయం నువ్వు నమ్మకపోవచ్చు: కాని, కాలంమాత్రం రుజువు చేస్తుంది. నీ కాపరాన్ని ధర్మం శాసించిన రీతిగా సంఘంయిచ్చే హంగులతో సరిచేసుకో, దిద్దుకో, వుద్ధరించుకో."

"నమ్మక...."

"నిన్ను ఎలా నమ్మించగలను, నామాట నమ్ము"

"మా అమ్మమీద వట్టుపెట్టుకో."

"వట్టు" అనే పదం మూర్ఖులకియిచ్చే విశ్వాసాన్ని తలంచుకు నవ్వుకున్నాను.

"మా అమ్మమీద వట్టు," అన్నాను.

ఆ సాయంత్రమే, అమ్మ మంచిరోజు కాదని మొర పెడ్తున్నా, చంద్రపురి వెళ్ళిపోయాను. నాకు ఆనాడే తెలుసు. లలిత చేతులు కాలేదాకా ఆకులు పుచ్చుకోదని. కాని, నేనుమాత్రం ఏమంత తెలివితేటలతో ప్రవర్తించాను? లలితతో ఖజ్జాపెట్టుకు, పట్టుదలకోసం, మూర్ఖంతో ఒక అమృతహృదయాన్ని కోల్పోయానే:

వెంకట్రావు ఎన్నో ఉత్తరాలు రాశాడు. లలితమీద కోపంకొద్దీ తన్ను అంధకారంలో వదిలెయ్యడం క్షంతవ్యం

కాని అపచారమన్నాడు. నేను ఒక్క వుత్తరానికీ జవాబు వ్రాయలేదు.

ఇది జరిగిన రెండునెలలకి వెంకట్రావు చంద్రగిరి వచ్చాడు. ఇతనావూరు వచ్చాడని తెలీగానే ప్రొఫెసరు గారికి మా సమాచారమూ, పరిచయమూ, తత్ఫలితాలూ ఆది నించీ నివేదించాను. ఆయన ఒకపెద్ద నవ్వు నవ్వి ఆరి పోయినపైపు వెలిగిస్తూ, "వోస్! యింతేనా! నువ్వు వూళ్ళో లేవని చెప్పుతాను. మేనమామగారింటికి వెళ్ళిం దంటాను" అన్నారు.

ప్రొఫెసరుగారిచేత అబద్ధం ఆడించిన సంగతి ఎలా తెలిసిందో తెలిసింది అతనికి.

మరి మూడునెలలు గడిచాయి. సుస్తీగా వుందనీ, టి. బి ఏమో అని భయపడుతున్నారనీ కర్ణాకర్ణిగా విన్నాను.

ఇంకో మూడుకాయితాలు చింపాను,—మా కాలండ ర్లోవి. మద్రాసునుంచి టెలిగ్రాం వచ్చింది, తన తప్పులు క్షమించి, తక్షణం రావలసిందని లలిత ప్రార్థన. ప్రొఫెసరుగారితో చెప్పి వెళ్లాను.

వెంకట్రావు నీరసించి, మంచానికి పట్టివున్నాడు. పాలి పోయిన చెక్కిళ్ళూ, వణుకుతున్న పెదవులూ, బొమికలు కనిపించే దేహం - అదీ అతనిస్థితి.

వెంకట్రావు మాట్లాడేందుకు శక్తి చాలక. మంచంమీద కూచోమని సంజ్ఞ చేశాడు. పొంగి పొర్లిపోతున్న విచా

రాన్ని అపుచేసుకుంటూ పక్కన కూచున్నాను. కాని, అతను మాత్రం Emotions ఏమీచేకుండా, నా చెయ్యి అతని గుండెలమీద వుంచుకుని, ప్రయాసతో ఒక్క నిట్టూర్పు విడిచి, జీవితానికి ఆఖరుసారి కళ్లు మూసాడు.

ఉదయం పదకొండింటికే సూర్యుడస్తమిస్తున్నట్లుగానూ, ప్రపంచమంతా అంధకారంలో మునిగిపోతున్నట్లుగానూ తోచింది. యిద్దరమూ ఏడ్చాం. ఆ ఏడుపులో అన్నాను. "లలితా మనిద్దరిమధ్యా నలిగి యిలా అయిపోయాడు. ఇద్దరమూ పంచుకున్నాము."

(ఏప్రిల్ – 1940)